క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డేపల్లి, విజయ్‌పాల్ కాలనీ, టీచర్స్ కాలనీ -2, జీఎంఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పోచమ్మమైదాన్, కల్యాణ్ నగర్, టీచర్స్ కాలనీ, ఏకశిల నగర్, నవయుగ కాలనీ, గణేష్ నగర్, బ్యాంక్ కాలనీ, డాక్టర్స్ కాలనీ -2, మట్వాడ, ఎల్లం బజార్, ఆదర్శనగర్, పుప్పాల గుట్ట, ఖిలా వరంగల్, వసంతపూర్, దూపకుంట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వడ్డేపల్లి బండ్ కబ్జాకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు



హన్మకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 60వ డివిజన్ పరిధి హనుమకొండ వడ్డేపల్లి శివాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని 690 సర్వే నంబర్‌లోని 33 గుంటల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణదారులు కబ్జా చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. స్థలం కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వృద్ధురాలిని అనాథాశ్రమంలో చేర్పించిన ఇన్‌స్పెక్టర్



మడికొండ: కొన్నేళ్లుగా మడికొండ గ్రామంలో అనాథగా ఉంటున్న తమిళనాడు రాష్ట్రం తిరుచుసేలంకు చెందిన షర్మిలదేవి అనారోగ్యం కారణంగా మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికులు గమనించి మడికొండ పోలీసు ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు సమాచారం అందించారు. సీఐ అక్కడికి చేరుకుని హనుమకొండలోని మదర్ ఫౌండేషన్ అనాథాశ్రమంలో చేర్పించి వైద్యం చేయించారు. దాంతో ఇన్‌స్పెక్టర్‌ను స్థానికులు అభినందించారు.

ఆశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



ఖిలా వరంగల్: తిమ్మాపురం లక్ష్మీపురంలోని న్యూలైఫ్ బాలికల ఆశ్రమాన్ని టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ జీ కంపెనీ సిబ్బంది మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులకు పండ్లు, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ఇన్‌చార్జ్ హరీష్, ఆర్ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం పరిశోధకుడు ఎర్రోజు శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్క్రీనింగ్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఫర్ యాంటి ఫెర్టిలిటీ ఇన్ మేల్ ఆల్‌బినో ర్యాట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

అబాకస్ పోటీల్లో శశాంక్ ప్రతిభ



ఖిలా వరంగల్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో వరంగల్ కరీమాబాద్‌లోని బ్రిలియంట్ హైస్కూల్‌కు చెందిన బానోతు శశాంక్ పాల్గొని ప్రతిభ కనబరిచి ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. ఈమేరకు పాఠశాలలో శశాంక్, ట్రైనర్ హేమలతను పాఠశాల డైరెక్టర్ బండి అవినాష్, ప్రిన్సిపాల్ సతీష్, తదితరులు మంగళవారం అభినందించారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

మడికొండ: ప్రభుత్వ నిషేధిత సుమారు రూ.1,96,800 విలువగల గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మడికొండ గ్రామానికి చెందిన రవికంటి చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్ తెలిపారు.

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలో రూ.50 వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. సుంచు వెంకటేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

‘కోట’లో అరకొర సౌకర్యాలు

- తాగునీరు, టాయిలెట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పర్యాటకులు
- ఖిలా వరంగల్ కోట అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు



చెత్తడబ్బా పక్కనే భోజనాలు చేస్తున్న విద్యార్థులు



మూసివేసిన టాయిలెట్స్ ముందు భోజనాలు చేస్తున్న విద్యార్థినులు



బోరు నీళ్లు తాగుతున్న విద్యార్థులు



మూడు బస్సుల్లో కోటకు వచ్చిన విద్యార్థులు

వరంగల్ / ఖిలా వరంగల్: వరంగల్‌లో ప్రసిద్ధి చెందిన వరంగల్ కోటలో ఉన్న అరకొర సౌకర్యాలతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం నుంచి జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా ఖిలా వరంగల్ కోట సందర్శనకు మంగళవారం వచ్చారు. టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం లేక వారు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకంలో విద్యార్థులను స్టడీ టూర్‌కు తీసుకెళ్లాల్సి ఉంది. ఈక్రమంలో నిత్యం తెలంగాణ ప్రాంతం నుంచి ఏదో ఒక జిల్లా నుంచి స్కూల్ విద్యార్థులు వరంగల్ కోటను సందర్శించేందుకు వస్తున్నారు. వచ్చిన విద్యార్థులు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పర్యాటకులు కోరుతున్నారు.

సౌకర్యాలపై దృష్టి సారించాలి



ఖమ్మం జిల్లా పీఎంశ్రీ పథకంలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున కోట సందర్శనకు వచ్చాం. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. ఎంతో పేరుగల ఖిలా వరంగల్ కోటలో వసతులు కల్పించేందుకు అధికారులు చర్య తీసుకోవాలి.

– దారా రాజేష్, హెచ్ఎం, తిరుమలాయపాలెం.

రుసుం వసూలు చేస్తున్నారు



ఖమ్మం జిల్లా జల్లెపల్లి ఉన్నత పాఠశాల నుంచి 120 విద్యార్థినులు, 125మంది విద్యార్థులను పీఎంశ్రీలో భాగంగా స్టడీ టూర్‌కు తీసుకొచ్చాం. అందరివద్ద నుంచి రుసుం వసూళ్లు చేస్తున్నారు. అందుకు తగిన సౌకర్యాలు మాత్రం లేవు. విద్యార్థినులు తమ అవసరాలు తీర్చుకునేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు.

– పి.ఉషశ్రీ, ఉపాధ్యాయురాలు

టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడ్డాం



స్టడీ టూర్‌లో భాగంగా ఖిలా వరంగల్ కోటకు వచ్చాం. పార్కులో భోజనాలు చేశాం. తాగునీటి సౌకర్యం లేదు. బాలికలకు టాయిలెట్లు లేవు. టిక్కెట్ల రూపంలో డబ్బులు తీసుకున్నారు, కాని సౌకర్యాలు కల్పించలేదు.

– జల్లెపల్లి స్కూల్ విద్యార్థినులు

సమగ్ర ఇంటింటి సర్వే అశాస్త్రీయం



సర్వే ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రిపోర్ట్ అశాస్త్రీయంగా ఉందని, ఆ రిపోర్ట్‌ను వ్యతిరేకిస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు తెలిపారు. ఈమేరకు కేయూ దూర విద్య కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన నివేదికలో బీసీలను 46శాతం తక్కువ చేసి చూపించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 2014లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51శాతం బీసీ జనాభా ఉండగా, ఇప్పుడు 46శాతానికి ఎలా తగ్గిందని ప్రశ్నించారు. 18అగ్రకులాల జనాభా 15.79శాతం ఉంటే 134 బీసీల కులాల జనాభా 46 శాతం మాత్రమే ఉంటుందా అని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో బీసీ నాయకులు దారబోయిన సతీష్, వినయ్‌చారి, డాక్టర్ పాలడుగుల సురేందర్, వేణుచారి, డాక్టర్ రమేష్, బంక రాకేష్, బండి డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేను వ్యతిరేకిస్తున్నాం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో అవకతవకలు జరిగాయని, ఆ సర్వేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేడారపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్ గౌడ్ తెలిపారు. ఫోరం నాయకులు కేయూ మొదటి గేట్ వద్ద సర్వే ప్రతులను మంగళవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలో పారదర్శకత లేదని విమర్శించారు. ఇదంతా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడుకోవడానికేనని అన్నారు. నాయకులు రమేష్, దక్షిణామూర్తి, క్రాంతి, జ్ఞానేశ్వర్, సురేష్, చందు, వెంకీ, శ్రీనివాస్, నాగరాజు, ప్రవీణ్, రాములు, అనిల్, అరుణ్, మణిశర్మ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



కాజీపేట: మాట్లాడుతున్న శ్రీనివాస్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కుమార్‌మాదిగ, బొడ్డు దయాకర్ మాదిగ, కవి, రచయిత మిట్టపెల్లి సురేందర్ డిమాండ్ చేశారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వెయ్యిగొంతులు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిమాదిగ ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో రెండో గేట్‌నుంచి మెయిన్ లైబ్రరీ వరకు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ మహా ప్రదర్శనను విజయవంతం కోరారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ సంకినేని వెంకట్, గజ్జల మల్లేశ్, మోహన్, రాజ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

వర్గీకరణ అయ్యే వరకూ పోరాటం

కాజీపేట: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టేంత వరకూ మాదిగలు ఐక్యంగా ఉంటూ పోరాటాలు చేయాలని, మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని మాదిగ మహాజనుల వేదిక కన్వీనర్ గబ్బెట శ్రీనివాస్ సూచించారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొల్లె కుమార్, అరూరి సాంబయ్య, మేకల రవీందర్, సందెల విజయ్, గద్దం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డైరీని ఆవిష్కరిస్తున్న సీఎండీ, తదితరులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు జి.ఆంజనేయులు, కార్యదర్శి బి.వెంకటరాజు కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని టీజీయూఈఈయూ ఎన్పీడీసీఎల్ నూతన కమిటీ మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని, ఆర్టిజన్‌లకు పదోన్నతులు కల్పించాలని, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, జేఎల్ఎంలకు ఏరియర్స్ చెల్లించాలని, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. అనంతరం యూనియన్ డైరీని ఆవిష్కరించారు. అనంతరం, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, అశోక్, మధుసూదన్, సదర్‌లాల్‌ను కలిశారు. టీజీయూఈఈయూ రాష్ట్ర కార్యదర్శి నలువాల స్వామి, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, సీఐటీయూ నాయకుడు జి.ప్రభాకర్ రెడ్డి, టీజీ యూఈఈయూ సహాయ కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా నారాయణ కొనసాగింపు

- స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా వెంకయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్‌గా జువాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఈసం నారాయణ పదవీ కాలాన్ని మరో సంవత్సరం పొడిగిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జువాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వై.వెంకయ్య పదవీ కాలాన్ని మరో సంవత్సర కాలం పొడిగించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రావుల సుదర్శన్



హన్మకొండ: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రావుల సుదర్శన్ నియమితులయ్యారు. హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన సుదర్శన్‌కు జిల్లా ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్ఈడీ బల్బుల తయారీపై వర్క్‌షాప్



ఎల్ఈడీ బల్బుల తయారీ విధానాన్ని నేర్చుకుంటున్న విద్యార్థినులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఎల్ఈడీ బల్బుల తయారీపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ ఎల్ఈడీ బల్బుల తయారీతో స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్, తెలంగాణ ఇన్నోవేటర్ అవార్డు గ్రహీత మల్లేశం.. ఎల్ఈడీ బల్బుల తయారీపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అరుణ, భౌతికశాస్త్ర విభాగం అధిపతి కవిత, డాక్టర్ అరుణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



ప్రాణాయామం చేస్తున్న శారద స్కూల్ విద్యార్థులు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన గుడి కార్యక్రమంలో భాగంగా రథసప్తమిని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ పాఠశాలలో వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. టీటీడీ జిల్లా బాధ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య పాఠశాల, వరంగల్ పిన్నావారి వీధిలోని శ్రీశారద ఉన్నత పాఠశాలల విద్యార్థులతో ఆదిత్య హృదయ పఠనం, సూర్య నమస్కారాలు, విశేష పూజలు చేయించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేఖ, ఇన్‌చార్జ్ ఉదయ్‌భాస్కర్, యోగా మాస్టర్లు పోశాల శ్రీనివాస్, శారద స్కూల్ కరస్పాండెంట్ గుమ్మడవెల్లి సురేష్, తిరునగరి విజయ్‌రాజు, యోగా గురువు విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకల పంపిణీ




హసన్‌పర్తి: నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న వాకర్స్

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని దళితవాడ పాఠశాల విద్యార్థులకు కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్ మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడానికి వాకర్స్ అసోసియేషన్ ముందుంటోందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బొక్క కుమార్, సభ్యులు కాలె యాదగిరి, కీర్తి సూరయ్య మండల భిక్షపతి, సత్యనారాయణ, భాస్కర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పలకల పంపిణీ

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల విద్యార్థులకు పలకలను జూలకంటి నిరాలి పటేల్ మంగళవారం పంపిణీ చేసింది. తన కూతురు అక్షరాభాస్యం సందర్భంగా తాను పనిచేస్తున్న పాఠశాల చిన్నారులకు పలకలు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయురాలు రాజశ్రీ తెలిపారు. అలాగే, మరో ఉపాధ్యాయురాలు రమాదేవి కూడా తన మనుమరాలు సాన్వి అక్షరాభ్యాసాన్ని పురస్కరించుకొని పలకలు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ధర్మయ్య, ఉపాధ్యాయురాలు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో క్యాన్సర్‌ను జయించవచ్చు



ర్యాలీలో పాల్గొన్న వలంటీర్లు, విద్యార్థులు

- ఏవీవీ ప్రిన్సిపాల్ డాక్టర్ భుజంగ రెడ్డి

రామన్నపేట: ఆత్మవిశ్వాసం, ధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని ఏవీవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజంగరెడ్డి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కోడిమాల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై నగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో క్యాన్సర్ వేగంగా వ్యాపిస్తోందని, ఇది తీవ్రమైన స్థాయికి చేరుకునేలోపే ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం రోజూ 1,600 మంది క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీకాంత్, వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, హరిణి, హాసిని, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న రహమాన్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ రహమాన్, విక్రమ్ శర్మ, రాకేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మల్లారెడ్డిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లిలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఉచిత మందులు అందించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సిద్దాపురం పశు వైద్యాధికారి డాక్టర్ అర్చన, సిబ్బంది అల్తాఫ్, అజీంపాషా, ఎల్లాస్వామి, రమేష్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రావు, గోపాలమిత్ర రాజేష్, రాజు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన సీఐని సస్పెండ్ చేయాలి

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా కోర్టు న్యాయవాది గంధం శివపై అకారణంగా దాడిచేసి కొట్టి అవమానపర్చిన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిపై చట్టరీత్యా చర్య తీసుకొని తక్షణమే సస్పెండ్ చేయాలని వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ బాధ్యులు తీర్మానించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని అంబేడ్కర్ హాల్‌లో వరంగల్ బార్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, హనుమకొండ బార్ ప్రెసిడెంట్ మాతంగి రమేష్ బాబు, వరంగల్, హనుమకొండ ప్రధాన కార్యదర్శులు ముద్దాస్సిర్ హమ్మద్ ఖయ్యూమి, లడే రమేష్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ టెస్టుకు సహకరించని వ్యక్తిపై కేసు

వరంగల్ క్రైం: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 3న రాత్రి 8 గంటల సమయంలో కేయూ జంక్షన్ సమీపంలో ట్రాఫిక్ ఎస్సై యుగేందర్, కానిస్టేబుల్ రమేష్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఆ సమయంలో మద్యం తాగి కారు నడుపుతూ వెళ్తున్న అడ్వకేట్ గంధం శివ.. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలకు సహకరించకుండా అధికారులతో దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అమర జవాన్ వర్ధంతి

మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ అమర జవాన్ అమంచ కోదండపాణి 22వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జవాన్ విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కోదండపాణి అమ్మ సరోజన, కోదండపాణి సోదరుడు శ్రీనివాస్, జయలక్ష్మి, స్వప్న, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బేరింగ్ రమేష్, చిలువేరు పవన్, గుండా రవికుమార్, రమణ, మోహన్‌రావు, లడ్డు వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

నాగమయ్య గుడి నిర్మాణ పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: పడమరకోట అగర్త చెరువు వద్ద నాగమయ్య ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. నాగమయ్య విగ్రహాన్ని సందర్శించి నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఆలయ నిర్మాణ పనులను సాగర్ల శ్రీనివాస్, గజ్జల శ్యామ్, మాజీ కార్పొరేటర్ దామోదర్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ ప్రారంభించారు. కార్యక్రమంలో రవీందర్, సారంపాణి, ఐనుముల మల్లేశం, వేణుగోపాల్, తోటకూరి నరసయ్య, గణేష్‌సింగ్, ఈశ్వర్‌సింగ్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి



కాజీపేట రూరల్: రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సికింద్రాబాద్ జోనల్, డివిజన్ కమిటీ నాయకత్వంతో కలిసి కృషి చేయనున్నట్లు కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆపరేటింగ్ అండ్ కమర్షియల్ బ్రాంచ్ సెక్రటరీ, అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్.రావు తెలిపారు. కాజీపేట రైల్వే ఆస్పత్రి ప్రాంగణంలో సంఘం ప్యాకెట్ డైరీ కవర్స్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ మెడికల్, సీఅండ్‌డబ్ల్యూ, ఎలక్ట్రికల్, ఎస్‌అండ్‌టీ బ్రాంచ్ సెక్రటరీ చింత తిరుపతి, కాజీపేట రైల్వే డీసీఈటీసీ ఇన్‌స్ట్రక్టర్ పీయూ రజినికాంత్, విపిన్‌కుమార్, రవీందర్ కుమార్ పాల్గొన్నారు.

ఏజే మిల్లు భూములను కాపాడాలి

వరంగల్: ఆజంజాహి మిల్లు భూములపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు భూమి ఇవ్వడంతో పాటు కూల్చిన స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఒక ప్రకటనలో కోరారు. మిల్లు కార్మికులు 318 మందికి 23 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు.

ఫర్టిలిటీకి కీమోథెరపీ అడ్డంకి కాదు

నయీంనగర్: కీమోథెరపీకి ముందు స్పెర్మ్ నిల్వ చేసి ఒయాసిస్ ఫర్టిలిటీలో ఓ జంట పాపను పొందినట్లు డాక్టర్ కావ్యరావు జలగం తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో భాగంగా కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ అనివార్యం అయినప్పుడు రోగుల ఫర్టిలిటీ (సంతానోత్పత్తి ప్రాధాన్యం) ప్రభావితమవుతుందని అన్నారు. ఆధునిక వైద్యశాస్త్రం ద్వారా ఫర్టిలిటీని సంరక్షించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. అందుకు ఒయాసిస్ ఫర్టిలిటీ సెంటర్‌లో బిడ్డను పొందిన ఓ జంటే ఉదాహరణ అని వివరించారు.

సంస్కృతి –25 వెబ్‌సైట్ ఆవిష్కరణ

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 7, 8వ తేదీల్లో సంస్కృతి -25 ట్రైలర్, వెబ్‌సైట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ చివరిరోజు లైవ్ బ్యాండ్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ ఎం.శ్రీలత, ప్రొఫెసర్ నర్సింహారావు, ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి, పీఆర్వో డాక్టర్ ప్రభాకరాచారి, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ – బైక్ ఢీ.. యువకుడికి తీవ్రగాయాలు

ఖిలా వరంగల్: బైక్‌ను ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలో భట్టుపల్లి రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ చెందిన ప్రణయ్ బైక్‌పై భట్టుపల్లి మీదుగా కరీమాబాద్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో ఉర్సుగుట్ట సమీపంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. దాంతో యువకుడికి తీవ్ర గాయాలు కాగా, క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అమ్మవారిని దర్శించుకున్న గంట రవికుమార్

హన్మకొండ కల్చరల్: భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంటా రవికుమార్ రెండోసారి ఎన్నికైన సందర్భంగా భద్రకాళి దేవాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

బీజేపీ నేత అరూరి రమేష్‌కు పరామర్శ

వరంగల్: జనగామ జిల్లా ఉప్పుగల్ గ్రామంలో బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తల్లి అరూరి వెంకటమ్మ సోమవారం మృతి చెందారు. ఈమేరకు ఆయనను పార్టీ నేత వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం పరామర్శించారు.

దేశ ప్రజల డ్రీమ్ బడ్జెట్

వరంగల్: ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ డ్రీమ్ బడ్జెట్ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ అన్నారు. కాశిబుగ్గ చౌరస్తాలో 18, 19, 20, 21వ డివిజన్ల అధ్యక్షుడు అపురూప రజనీష్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు.

కార్మికులను తప్పుతోవ పట్టించేందుకే లేఖ

ఖిలా వరంగల్: ఆజంజాహి మిల్లు కార్మికులను తప్పుతోవ పట్టించేందుకే మావోయిస్టు పేరుతో లేఖను సృష్టించారని సీఎల్‌సీ నాయకుడు కాంపెల్లి ప్రవీణ్ అన్నారు. హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌పై విడుదలైన మావోయిస్టు లేఖ బూటకమని పేర్కొన్నారు.

నేడు మల్లికాంబలో అవగాహన సదస్సు

నయీంనగర్: వీగార్డ్, చాయ్ సంస్థ నవదర్శన్‌లో భాగంగా నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు బుధవారం అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు మల్లికాంబ నిర్వాహకులు ప్రొఫెసర్ పద్మ, బండా రామలీల తెలిపారు. వివరాలకు 70328 74926 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కోడం కల్యాణ్, వసంత, తదితరులు పాల్గొన్నారు.